# యుగధర్మం

"జగన్నాథం ఈ రోజుకూడా రాలేదు!" అన్నాను.

"ఫస్టు తారీఖున పెన్షన్ తీసుకొందుకు ట్రెజరీకి వచ్చాడు. చాలా నీరసంగా వున్నాడు. జ్వరం వస్తోంది అని చెప్పాడు" అన్నారు శర్మగారు.

"ఏ మాత్రం సులువుగా వున్నా రాక మానడు!" అన్నారు సీతారామయ్యగారు. మేము-అంటే రిటైరయినవాళ్ళం మొత్తం ఆరుగురం ప్రతి రోజూ సాయంత్రం జగన్నాథస్వామి ఆలయంవద్ద కల్సుకొంటూ వుంటాం.

ఆ ఆలయ ప్రాంగణంలో దాదాపు ప్రతి రోజూ ఏవో ప్రసంగాలూ, ఉపన్యాసాలూ వుంటాయ్ . చీకటి పడేవరకూ అక్కడ కాలక్షేపంచేసి యెవరింటికి వాళ్ళంపోతాం. మా కందరికీ అదో కాలక్షేపం. ఆ రోజు సాయంత్రం తిరిగి వస్తూంటే జగన్నాథాన్ని చూడాలనిపించింది. కడపలో పని చేసేటప్పుడు మేమూ, జగన్నాథమూ ఒకే యింట్లో అద్దెకుండేవాళ్ళం. ఒకే కుటుంబంలా మసలేవాళ్ళం. ఆ తర్వాత అక్కడ నుంచి మాకు బదిలీలయ్యాయి. ఆశ్చర్యం ఏమిటంటే చాలా వూళ్ళు తిరిగిన మేము ఆఖరున కాకినాడలోనే రిటైర్ అయ్యాం.

జగన్నాథం యింటి గుమ్మంలో ఆరేళ్ళ అబ్బాయి వారి మనవడు ఎదురయ్యాడు.

"బాబూ! తాతగారున్నారా?" అడిగా.

"ఆ వుండకెక్కడికెళ్తారు!" విసుగ్గా అనేసి వీధిలోకి తుర్రుమన్నాడు. ఆ అబ్బాయి జవాబుకి విస్తుపోతూ గుమ్మం ముందు నిలబడి వుండిపోయా. తలుపులు వారగా వేసివున్నాయ్. పేరు పెట్టి పిలవడమా లేక తలుపు తోసుకొని లోనికి వెళ్ళడమా అని ఆలోచిస్తూంటే, జగన్నాథం సతీమణి బత్తాయి తొక్కలు పారవేయడానికి తలుపుతీసుకొని వీధిలోనికి వచ్చింది. నన్ను చూసి గుమ్మంలోనే ఆగిపోయింది.

"జగన్నాథం వున్నాడమ్మా?" అడిగా.

ఆమె ఒకడుగు వెనక్కువేసింది. లోనికి వెళ్ళడానికి ఖాళీయిస్తూ.

"ఉన్నారు ! రండి !" అంది.

గదిలో జగన్నాథం నులక మంచం మీద పడుకొని వున్నాడు. చాలా నీర్సంగా వున్నాడు. మంచంకింద పళ్ళరసం తాగిన గ్లాసూ, రెండు మందుసీసాలూ వున్నాయ్. నన్ను చూసి కళ్ళతోనే పలకరించాడు.

"నీకు సుస్తీగా వున్నట్లు యిప్పటి వరకూ తెలీదు సుమీ!" అన్నా. రెండు బత్తాయి పళ్ళయినా తీసుకొని వెళ్ళనందుకు సిగ్గుపడ్డాను.

శక్తినంతట్నీ కూడదీసుకొని కూర్చోవాలని వ్యర్థప్రయత్నం చేశాడు.

"లేవద్దు!" అన్నా. అక్కడనే ఒక స్టూలు అతని మంచానికి దగ్గరగా వేసుకుని కూర్చున్నా.

" ఏవిటి సుస్తీ?" అడిగా.

"ఏదో సైగ చేశాడు. నాకర్థం కాలేదు. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయ్. పక్క గదిలోంచి మాటలు వినిపించసాగాయి.

"పెద్ద మరిదిగారు మూణ్ణెల్లనుంచీ పంపించడం మానేశారు. చిన్న మరిదిగారి నుంచి మనియార్డరు యింకా రాలేదు. పదిహేనో తారీఖు వచ్చింది. ఆఖరి మరిది డబ్బు పంపకపోతే పోయె! వుత్తరాలకైనా జవాబు రాయడు! ఇక్కడెలా గడుస్తుందను కొంటారో! మాకు మాత్రం పిల్లా పీచూ లేరా ? పెద్ద కొడుకు అయినంత మాత్రాన అందర్నీ పోషించాల్సిన బాధ్యత ఆయన ఒక్కరి మీదనే వుందా? మీ అబ్బాయికి వేలకువేలు జీతం వస్తుందనుకొంటున్నారా?" విసుక్కొంటోంది జగన్నాథం కోడలు.

"రాంబాబు ఏవో యిబ్బందుల్లో వుండి వుంటాడు! శేషు ప్రతి నెలా ఐదో తారీఖుల్లా పంపించేవాడు. ఎంచేతనో యింకా పంపలేదు. కేంపుల్లో వున్నాడేమో!" సర్దిచెప్పాలని ప్రయత్నిస్తోంది జగన్నాథం భార్య.

"ఉన్న బంగారం అంతా తమ్ముళ్ళకీ చెల్లెళ్ళకీ తగలేశారు. పిల్లలెదిగేసరికి వాళ్ళకి గోచీగుడ్డ కొనడానికి కూడా దిక్కులేదు! తల్లిదండ్రులున్నారన్న జ్ఞానంవుండక్కర్లే!"

"ఎవరో వచ్చారు! కొంచెం వూరుకోమ్మా! మన గొడవలు ఎప్పుడూ వున్నవేనూ!" తల్లి ధోరణిని అరికట్టాలని ప్రయత్నించాడు జగన్నాథం పెద్ద మనవడు.

"నువ్‌నోర్మూసుకొని అవతలికెళ్ళు!" కొడుకుని కసిరింది తల్లి.

"మీ మావగార్ని చూడ్డానికి సుబ్బరామయ్యగారొచ్చారు!" చెప్పింది జగన్నాథం భార్య. నా ఉనికిని తెలియజేస్తే కోడలు మాటలు తగ్గిస్తుందని ఆశించింది.

వారి మాటలు ఆగిపోయాయ్.

జగన్నాథం నాతో ఏదో అనాలని ప్రయత్నిస్తూంటే నా బల్లను యింకా దగ్గరగా వేసుకొని ముందుకు వొంగున్నా.

"మనతండ్రులూ వాళ్ళ అన్నదమ్ములు మధ్య వున్నంత అన్యోన్యతా - అనురాగమూ మన అన్నదమ్ములలో లేవు. మన అన్నదమ్ముల మధ్య వున్నంత ఆత్మీయతా అభిమానమూ మన పిల్లలలో కన్పించవ్. తరం మారినకొద్దీ అంతరం పెరుగుతోంది. ఇకముందు జనరేషన్‌లో అన్నదమ్ములు కూడా స్నేహితుల్లా పలకరించుకొంటారేమో!"

చిన్న స్వరంలో నీరసంగా అన్నాడు. అవునన్నట్లు తలూపాను.

"పిల్లల్ని కన్నాం! వాత్సల్యంతో పెంచి ప్రయోజకుల్ని చేశాం. కాబట్టి వాళ్ళు మనల్ని అంత్య దశలో ఆదుకొంటారని ఆశించడం వట్టి అవివేకమే అవుతుందోయ్!" అన్నాడు మరలా.

మౌనంగా ఉండిపోయా. లేనిశక్తిని కూడదీసుకొని మాట్లాడుతున్నాడు జగన్నాథం.

"మన తల్లిదండ్రులకి మనం ఏ పాటి చేయగలిగావో గుర్తుకు తెచ్చుకుంటే మన పిల్లలు ఆఖరి దశలో ఆదుకోవడం లేదన్న ఆవేదన అంతగా వుండదోయ్!" అన్నాడు.

"పోనీ హైదరాబాదు వెళ్లి రెండో అబ్బాయి దగ్గర పది రోజులుండి రారాదూ!" అన్నా ఏదో అనాలని.

నా సూచనను తిరస్కరిస్తూ అడ్డంగా తలూపాడు జగన్నాథం.

"అలా తిరగడం మొదలు పెడితే మా బ్రతుకులు తిరగడమే అయిపోతుంది.! నాకు నలుగురు కొడుకులు ఉన్నారన్న సంగతి మరిచిపోకు!" అన్నాడు.

ఎవరో వీపు మీద చెళ్ళున చరిచినట్లు అయింది. అనాలోచితంగా అలా మాటాడి నందుకు సిగ్గుపడ్డా.

"అహ! అదికాదు నా వుద్దేశం! హైదరాబాదులో అయితే పెద్ద డాక్టర్లుంటారని" మాటలు మారుస్తూ తొట్రుపాటుపడ్డాను.

"కాఫీ తీసుకోండన్నయ్యగారూ!" అంటూ కాఫీ గ్లాసుతో వచ్చింది అతని అర్ధాంగి.

"బావగారికి సుస్తీగా వుందని తెలీదు! నాలుగు రోజుల నుంచీ కనబడకపోతే చూసి పోదాం అని వచ్చా!" అన్నా కాఫీ అందుకొంటూ.

అక్కడ పది నిమిషాలు గడిపి ఇంటికి బయలుదేరా. దారిలో జగన్నాథం అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

"మన తల్లి దండ్రులకి మనం ఏపాటి చేయగలిగావో గుర్తుకు తెచ్చుకొంటే మన పిల్లలు మనల్ని ఆఖరి దశలో ఆదుకోవడంలేదన్న ఆవేదన అంతగా వుండదోయ్!" ఎంత సత్యం వుంది అతని మాటల్లో

❖ ❖ ❖ ❖ ❖

మేం నలుగురన్నదమ్ములం. కాకినాడలోని అందరికీ ఉద్యోగాలు. అందరికీ పెళ్ళిళ్ళయాయి. నాన్నగారు రిటైర్ అయ్యారు. అంతా కలిసి వుండేవాళ్ళం. అమ్మదే ఇంటి పెత్తనమంతా. మేం జీతాలు తెచ్చి అమ్మచేతిలో పోసేవాళ్ళం. అమ్మ చెప్పిందే వేదవాక్కు. ఆమె నిర్ణయాలకి తిరుగులేదు. సమష్టిగా కొన్ని సంవత్సరాలున్నాం.

తరువాత ఉద్యోగరీత్యా అందరమూ విడిపోయాం. ఎవరి బతుకు వాళ్ళం బతికేవాళ్ళం. అయినా అమ్మ అనుజ్ఞ ప్రకారం నడుచుకొనే వాళ్ళం. ఇంట్లో పెద్ద దిక్కు లేని సంసారాలు గడవటం మాకు కష్టంగా ఉండేది. మా దగ్గరకి రండి అంటే మా దగ్గరకి రండని అత్తమామలని కోడళ్ళు ఆహ్వానించేవారు. కారణం అమ్మ కోడళ్ళచేత చేయించుకొనేది కాదు. ఆమెకు కోడళ్ళ మడీ ఆచారం నచ్చదు కాబట్టి వంట యింటి పూచీ అంతా తనే తీసుకొనేది. అమ్మ అందరి కోడళ్ళ పరిస్థితినీ గమనించీ ఏ కోడలును ఆదుకోవాలో నిర్ణయించుకొని ఆ కొడుకు దగ్గరకి వెళ్ళేది. నాన్నగారితో సహా. ఆమె నిర్ణయాన్ని వ్యాఖ్యానించే శక్తిగానీ, అధికారంగానీ ఏ కోడలికీ ఉండేదికాదు. అలా కొన్ని సంవత్సరాలు గడిచాయ్.

మా దురదృష్టవశాత్తూ అమ్మ పక్షవాతం వచ్చి మంచాన పడింది. ఎంత వైద్యం చేయించినా గుణం కనబడలేదు. నాన్నగారు శారీరకంగాను, మానసికంగాను కృంగిపోయారు. వయస్సు ఎనభై దాటాయి. చూపు మందగించింది. చెవులు సరిగా వినిపించేవి కావు. అత్త మామలకి సేవ చేయాల్సిన వంతు వచ్చింది కోడళ్ళకి.

మా ఆఖరి చెల్లెలి కొడుకు బారసాలకి అందరమూ కలిశాం. కోడళ్ళు నలుగురూ సమావేశమై ఓ నిర్ణయానికి వచ్చారు. అత్తమామల్ని చెరి మూడేసి నెలలూ వుంచుకోవడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ సంగతి తెలుసుకొని నాన్న గారు చాలా బాధపడ్డారు. ఈ వృద్ధాప్యంలో ఎక్కడో ఒకచోట నిలకడగా వుంటేనే బావుంటుదన్నారు. కానీ మేం ఏం చేయగలం? నలుగురి కోడళ్ళకి ఏదో ఒక రకమైన యిబ్బంది వుంది. ఎక్కువ పిల్లలు ఒకరికి, డబ్బు చాలక ఒకరు, పిల్లల అనారోగ్యం ఒకరికి, భార్యకి సుస్తీ యింకొకరికి. అత్తమామలకి ఏళ్ళ తరబడి సేవ చేసే శక్తీ,

ఓపికా ఏ ఒక్క కోడలికీ లేదు.

"మీరంతా ఒట్టి భార్యావిధేయులురా!" అని ఘాటుగా విమర్శిస్తూ తన అసంతృప్తినీ, అసమ్మతినీ తెలియజేసింది మా అక్క.

మే మెవ్వరం మాట్లాడలేదు.

"నా దగ్గర అమ్మనీ, నాన్ననీ వుంచుకోగలను. దానికి మీ బావగారు ఏ అభ్యంతరం చెప్పరు. కానీ లోకం మిమ్మల్ని ఆడిపోసుకొంటుంది. కొడుకుల చేతిలోనే తన ప్రాణం పోవాలని అమ్మ కోరుకొంటోంది!" అంది అక్క గద్గదస్వరంతో. అక్క మాటలువిని అమ్మ కంటతడి పెట్టుకొంది. మూగవేదన వ్యక్తం చేసింది. నాన్నగారు శూన్యంలోకి చూస్తూ వుండిపోయారు. అయినా మేం నోరు కదపలేదు. నలుగురుమూ మౌనం పాటించాం.

కోడళ్ళ ఒప్పందం అమలులోకి వచ్చింది. అమ్మా, నాన్న నలుగురి పిల్లల దగ్గరా మూడేసి నెలల చొప్పున ఉండేవారు. అలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. మొదట అమ్మ తర్వాత నాన్నగారు రెండు సంవత్సరాల వ్యవధిలో పోయారు. ఆఖరి దశలో వారెంత ఆవేదన పడ్డారో మాకు తెలుసు. తీరని వ్యథకి గురిచేశాం.

నాకూ ముగ్గురు కొడుకులున్నారు. ఉద్యోగం చేసి ఆస్తిని కూడబెట్టలేకపోయినా పిల్లలకి పెద్ద చదువులు చెప్పించాను. అదృష్టవశాత్తూ అందరికీ మంచి ఉద్యోగాలే లభించాయ్. మన పిల్లలే మన ఆస్తి అనుకొని తృప్తిపడేవాళ్ళం నేనూ, నా భార్య.

పెద్దబ్బాయి హైదరాబాదులో బ్యాంకు ఆఫీసర్. రెండోవాడు శ్రీకాకుళంలో కాలేజీ లెక్చరర్. ఆఖరివాడు ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్‌లో జూనియర్ యింజనీర్. ఆఖరి అబ్బాయికి అయిదేళ్ళ క్రితమే పెళ్ళి చేశాను. నేను సర్వీస్‌లో వుండగానే వాడికి మా కాకినాడలో వుద్యోగం అయింది. నేను రిటైర్ అయిందీ కాకినాడలోనే కాబట్టి, ఆఖరివాడి దగ్గరే వున్నాం ఎవరికీ బాదరబందీలు లేవు. ఎవరి సంసారం వాళ్ళు గడుపుకొంటున్నారు. అందరికి పిల్లలున్నారు. అయితే పెద్ద సంసారాలు మాత్రం కావు. నాపెన్షన్‌లో పాలవాడికి డబ్బు యిస్తూ వుంటాను. ఆదీవద్దంటాడు మా అబ్బాయి.

"మీ పెన్షన్ మీ స్వంత ఖర్చులకి వుంచుకోండంటాడు"

"ముత్యాల్లాంటి ముగ్గురి పిల్లల్ని కన్నావోయ్!" అని జగన్నాథం అంటూవుంటే నాకు గర్వంగానే వుంటుంది.

ఆ రోజు యింటికి చేరేసరికి బాగా రాత్రి అయింది. నా భార్య విశాల మనవడికి అన్నం తినిపిస్తోంది. అబ్బాయి రఘు ఆఫీసు నుంచి వచ్చి బజారుకి వెళ్ళాడు. మేమిద్దరూవూ కల్సి భోజనం చేయడం అలవాటు. పంచ మార్చుకొని వాలుకుర్చీలో కూర్చున్నా.

"పెద్దబ్బాయి వుత్తరం రాశాడటండీ" అంది విశాల.

"ఏవని రాశాడూ?" అడిగా.

"ఉత్తరం చదవలేదు! సుగుణచెప్పింది" అంది.

వీధిలో పాలు పోయించుకొని లోనికి వస్తూన్న కోడలు సుగుణని అడిగా.

"ఏమ్మా! పెద్దవాడు జాబు రాశాట్ట!" అడిగింది విశాల.

"రాశారండీ!" జవాబు చెప్పి గదిలోకి వెళ్ళింది.

"అంతా కులాసాయేనా? ఏం రాశాడు?" "ఉత్తరం ఎక్కడ వుందే?" అడిగింది విశాల.

"ఉత్తరం అక్కడే టేబులు మీద పెట్టి వుంటారు చూడండి!" వంట గదిలో నుంచే సమాధాం ఇచ్చింది.

కుర్చీలోంచి లేచి టేబులూ, సొరుగూ వెతికి చూశా. ఎక్కడా కనబడలేదు. అంతలో అబ్బాయి రఘు వచ్చాడు.

"పెద్దన్నయ్య రాసిన ఉత్తరం ఏదిరా?" అడిగింది విశాల.

"అవునమ్మా! రాశాడు! అక్కడే రేడియో దగ్గర టేబులుమీదనే పెట్టానే!" చెప్పాడు బట్టలు మార్చుకొంటూ. అ వుత్తరం ఎంత వెతికినా కనబడలేదు.

విసుగెత్తి వూరుకొన్నాం. రాత్రి భోజనం చేస్తూ మరలా అడిగా.

"ఏం రాశాడురా మీ పెద్దన్నయ్య?"

"ఆఁ ఏం లేదు. మామూలు సంగతులే?" అన్నాడు.

"మీ వదినా, పిల్లలూ అంతా బావున్నారా?"

ఆతృతగా అడిగింది విశాల.

"పెద్ద కొడుకూ పిల్లలూ అంటే అత్తయ్యగారికి చెప్పలేనంత అభిమానం!" అనేసి నవ్వు మొహం పెట్టింది సుగుణ. కోడలి మాటలకి విశాల మనస్సు చివుక్కుమంది. ఆ సంగతి విశాల మొహంలో కొట్టవచ్చినట్లు కన్పించింది అయినా అత్తా కోడళ్ళ మధ్య ఆ పాటి మాట విసుర్లు వుండడం అతి సహజం అప్పుడప్పుడు మాటల విసరడం ఈ మధ్యనే మొదలుపెట్టింది సుగుణ. గమనించినా పట్టించుకోనట్లూ, వినిపించుకోనట్లూ ప్రవర్తించేవాణ్ణి. విశాల చాలాసార్లు నాతో అంది "కోడలు ధోరణి మారుతోంది సుమండీ" అని.

"ఉత్తరం కన్పించకపోవడం చాలా ఆశ్చర్యంగా వుందిరా!" అన్నా మాటలు మారుస్తూ.

"ఆఫీసు నుంచి వస్తూ రేడియో క్రింద పెట్టాను నాన్నగారు!" అన్నాడు.

"ఇంకా ఏమని రాశాడురా?" అడిగా, వాడు ముభావంగా వుండటం గమనించి.

"మిమ్మల్నిద్దర్నీ పంపమని రాశారు!" అన్నాడు పొడిగా.

"ఎక్కడికి, హైదరాబాదే?" కంగారు పడింది విశాల.

పకాల్న నవ్వింది సుగుణ.

"అత్తయ్యగారు! హైదరాబాదంటే కాశీ, కలకత్తా అనుకొంటున్నారా? అదీ మన తెలుగుదేశమే. మన కాకినాడలానే వుంటుంది. ఇంతకన్నా చాలా పెద్ద పట్టణం!" అంది సుగుణ.

"ఎందుకు రమ్మని రాసాడురా?" అడిగింది.

"పదిరోజులు యిక్కడ వుంటారు!" పంపమని రాశాడు!" చెప్పాడు పీటమీద నుంచి లేస్తూ.

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. పెద్దవాడు అర్జంటుగా రమ్మని యెందుకు రాశాడు? పిల్లలకి వంట్లో బాగుండలేదా? భార్యకి సుస్తీగా వుందా ? ఆలోచనలో పడ్డాను.

'ఏమండి! పెద్దవాడి దగ్గరకి వెళ్దామా?' అడిగింది విశాల.

"నీకు వెళ్ళాలనివుందా?" అడిగా.

"అవునూ! ఎందుకింత అర్జంటుగా పంపమని రాశాడూ!"

"ఏమో! అదే తెలీదు!"

"ఉత్తరం కనబడితే బావుణ్ణు! చదివితే అర్థం అయేది!" అంది నిరుత్సాహంగా.

"వివరంగా రాసి వుండడు! రాస్తే రఘు చెప్పడూ!" అన్నా.

మర్నాడుదయం చాకలికి బట్టలు వేస్తూ, "ఎల్లుండికల్లా తప్పకుండా తీసుకురావాలోయ్! అత్తయ్యగారు, మామయ్యగారు హైదరాబాద్ వెళ్తారు!" చాకలిని హెచ్చరించింది సుగుణ.

"అయితే తాతగారూ! హైదరాబాదు వెళ్తారా? నేనూ మీతో వస్తా" సావడిలో కూర్చున్న మనవడు నానాజీ మారాం చేయడం మొదలు పెట్టాడు.

"అలాగే బాబూ!" అన్నా.

"రేపే వెళ్దాం!" అన్నాడు చలాకీగా. "రేపే ఎలా వెళ్తార్రా! పదిరోజులుండా లాయను! మంచి రోజు చూసుకో వద్దూ! అయినా హైదరాబాద్ నువ్వెందుకు చదువక్కర్లేదా?" కొడుకుని కసిరింది సుగుణ. తెల్లమొహం వేశాడు నానాజీ. నాలుగు రోజులు గడిచాయ్.

"మీరు యెప్పుడు బయలుదేరుతున్నారో టెలిగ్రాంయిస్తే స్టేషనుకివచ్చి తీసుకొని వెళ్తానని అన్నయ్య రాశాడు!" చెప్పాడు రఘు.

"ఎల్లుండి పంచమీ బుధవారం బాగుంది. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో వస్తూన్నట్టు టెలిగ్రాం యివ్వు!" అన్నా.

సికిందరాబాద్ స్టేషన్‌కి పెద్దబ్బాయి భాస్కరం వచ్చాడు. టాక్సీ మీద ఇంటికి తీసుకొని వెళ్ళాడు. మమ్మల్ని చూడగానే ఆప్యాయంగా పలకరించి ఆదరణగా ఆహ్వానించింది పెద్దకోడలు సావిత్రి. మనవలూ, మనవరాళ్ళూ మమ్మల్ని వాటేసుకున్నారు. వారి ఆదరణకు ముగ్ధుల మయ్యాం.

"ఏమ్మా! సావిత్రీ! అర్జంటుగా మమ్మల్ని పంపమని ఉత్తరం రాయించావ్! బెంబేలెత్తి పారిపోయి వచ్చాం అనుకో!" అంది విశాల.

"కారణం లేకుండా కలహం రాదు! అవసరం లేకుండా ప్రయాణమూ వుండదత్తయ్యా!" అంది నవ్వుతూ.

"అదే! ఆ కారణం ఏవిఁటో ఆ ఉత్తరంలోనే రాస్తే మేమింతగా హడలి చచ్చేవాళ్ళం కాదుగా!" అంది విశాల.

"అయితే ఆ ఉత్తరం మీరు చదవలేదా?" అత్తాకోడళ్ళ సంభాషణ వింటూన్న భాస్కరం అడిగాడు తల్లిని.

"లేదురా! మతిమరుపు బడుద్దాయి! మీ తమ్ముడు వుత్తరం తెచ్చి ఎక్కడో పడేసాడు. ఎంత వెతికినా కనపడ్లేదు! అమ్మనీ, నాన్ననీ పంపు పది రోజులుండి వస్తారు అని రాశావని మాత్రం చెప్పాడు అన్నా.

ఒక్క క్షణం ఆగి, అన్నాడు భాస్కరం. "మీరు కాకినాడ వదిలి రారు! పిల్లలు మిమ్మల్ని చూడాలని వుందంటారు! మాకు రావాలని వున్నా పిల్లల్తోవస్తే ఎంత ఖర్చో మీకు తెల్సుగా! తక్కిన మనవల ముచ్చట కూడా మీరు తీర్చాలి! ఇక్కడ కొంతకాలం కూడా వుంటారని రమ్మని రాశా నాన్నగారు!".

విడమర్చి చెప్పాడు భాస్కరం. "తాతగార్నీ, మామ్మగార్నీ మన వూరు తీసుకురమ్మని పిల్లలు ఒకటే పట్టు! అందుకని రప్పించక తప్పలేదు అత్తయ్యగారు!" అంది సావిత్రి.

"సరి సరి మంచి పనే చేసారు!" ఆప్యాయంగా కోడల్ని చూసింది విశాల.

పెద్ద మనవడు రోజూ సాయంత్రం వేళ నగరం లోనికి తీసుకొని

వెళ్తుండేవాడు. కాలక్షేపం బాగుండేది. చార్మినార్, అబిడ్స్ సెంటర్, కోఠీ, గోల్కొండ చాలా ప్రదేశాలు చూపించాడు రోజుకొకటి చొప్పున. ఆనాడు సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్‌కి వెళ్దాం అన్నాడు. మూడో మనవడు ప్రకాష్ కూడా వస్తానని పేచీ పెట్టాడు. వాడిని కూడా తీసుకొని బయలుదేరాం.

పబ్లిక్ గ్గార్డెన్స్‌లో ఒకచోట కూర్చున్నాం. ఎండ తీక్షణం బాగా తగ్గినా వాతావరణం వేడిగా వుంది.

"తాతయ్యగారు! ఐస్‌క్రీం కొని తెస్తా!" అంటూ కాంటీన్ వైపు వెళ్ళాడు పెద్ద మనువడు.

ప్రకాష్ ఎదురుగా వున్న కాంటీన్ పేరును కూడబలుక్కుని చదవడం మొదలుపెట్టాడు. వాడు రెండో తరగతి చదువుకొంటున్నాడు.

"ఏరా బాబూ! నువ్ బాగా చదవడం లేదుట! మీ నాన్న చెప్పాడు!" అన్నా.

"బాగానే చదువుతున్నా తాతయ్యగారు! ప్రయివేట్‌కి కూడా వెళ్తున్నా! నాన్నగారు ఎప్పుడూ అలాగే అంటారు! నాకు ఎనిమిదెక్కాలు వచ్చు! డాక్టరుగారి అబ్బాయి రామూనికి ఐదో ఎక్కం కూడా రాదు! ఎప్పుడూ టీచర్ వాణ్ణి తిడుతూవుంటూరు!" చెప్పాడు వాడి ధోరణిలో.

"ఎలాగైనా నీ చదువు బాగులేదురా! రెండో క్లాసు వాడికి పన్నెండు, పదహార్ల వరకు ఎక్కాలు రావాలి! రోజూ నా దగ్గర పడుకో! ఎక్కాలూ, యింగ్లీషు పేర్లూ అవీ చెబుతా! క్లాసులో ఫస్టురావాలి తెల్సా?" అన్నా బుజ్జగిస్తూ.

"ఎన్నాళ్ళు చెబుతారు తాతయ్యగారు! మీరిక్కడ వుండేది మూణ్ణెల్లేటగా! అన్నాడు.

"మూణ్ణెల్లా! ఎవరన్నారు?" అడిగా కలవరంగా

"అమ్మా, నాన్నా అనుకొంటూ వుంటే విన్నా! ఇక్కణ్ణుంచి శ్రీకాకుళం పెద చిన్నాన గారింటికి వెళ్తారుటగా! అక్కడో మూణ్ణెల్లుంటారుటగా! మీకు మళ్ళా మా ఊరు వచ్చేసరికి పన్నెండే కాదు పదహారు ఎక్కాలు అప్పచెబుతాలెండి" అన్నాడు

అమాయకంగా.

నిర్విణ్ణుడనయ్యాను. పెద్దవాడు ఐస్‌క్రీమ్ తెచ్చి ప్రేమగా అందించాడు. తినాలనిపించలేదు. అయినా వాడి తృప్తికోసం తీసుకోక తప్పిందికాదు.

ఆరోజు రాత్రి .....

"హైదరాబాదంటే హడలిచచ్చాను! ఇక్కడ కూడా బాగానే వుంది సుమండీ!" అంది విశాల.

"అయతే ఇక్కడనే వుండిపోవాలని వుందా?" అడిగా.

"ఏం తప్పా! ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లల్ని కన్నాను! మనకి సౌఖ్యంగా వున్న చోట ఎంతకాలం అయినా ఉంటాం! మనకి అడ్డేవిటండీ!" అంది.

ఆమె అమాయకత్వానికి జాలి వేసింది. యుగధర్మం ఆమెకు తెలీదు.

ఆంధ్రజ్యోతి
14-8-1981